క్లుప్తంగా

ఆర్డీవోను కలిసిన వీఆర్వో సంఘ నాయకులు



ఆర్డీవోను మర్యాద పూర్వకంగా కలిసిన వీఆర్ఓ సంఘం నాయకులు

ఒంగోలు అర్బన్: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) లక్ష్మీ ప్రసన్నను వీఆర్ఓ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్డీవోను కలిసిన నాయకుల్లో ట్రెజరర్ కే జానయ్య, డివిజన్ అధ్యక్షుడు పీ చంద్రశేఖర్, రవికుమార్, రమణి, నీలిమ, శ్రీను తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న శ్రీమద్రామాయణం ప్రవచనం



ప్రవచనంలో పాల్గొన్న ఝాన్సీలక్ష్మి

ఒంగోలు మెట్రో: పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వీఐపీ రోడ్డులోని కార్యాలయ ఆవరణలో ఆదివారం పరిషత్ సభ్యురాలు అనఘా ఝాన్సీలక్ష్మీబాయి శ్రీమద్రామాయణ సూక్తులు సార్వకాలిక, సార్వజనీనములు అనే అంశంపై అందించిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. సంస్థ జాతీయాధ్యక్షులు పద్యభారతి చదలవాడ లక్ష్మీనరసింహారావు అధ్యక్షత వహించగా, కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు సభా నిర్వహణ గావించారు. సీహెచ్ భాస్కరరావు, జంద్యాల కామేశ్వరి ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. కోశాధికారి అనఘా వేంకట సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు పింగళి శ్రీనివాసరావు, పింగళి రామమోహనరావు, రావినూతల వరలక్ష్మి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ముమ్మరంగా సజ్జ నూర్పిళ్లు



కొనకనమిట్ల: మండలంలో ఖరీఫ్‌లో చేపట్టిన సజ్జపంట కోతలు కోసిన రైతులు ముమ్మరంగా సజ్జపంట నూర్పిడులు చేస్తున్నారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లో సజ్జ పంట సాగు చేశారు. మండలంలోని నాగంపల్లి, మునగపాడు, వెలిగండ్ల, నాగరాజుకుంట, చింతగుంట, అంబాపురం, రేగడపల్లి, వాగుమడుగు, సిద్ధవరం గ్రామాల్లో ఎక్కువగా సజ్జ సాగు చేశారు. అయితే ఈ ఏడాది అరకొరగా వర్షాలు పడటంతో పంట దిగుబడి పెద్దగా లేదని రైతులు తెలిపారు. సజ్జ పంట ఎకరాకు 8 నుంచి 10 బస్తాలు మేర దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం సజ్జలు క్వింటా ధర రూ. 2200 వరకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ఎక్కువగా కొనుగోలు చేస్తు రైతులకు కొంతమేర పెట్టుబడులు పోను లాభాలు వచ్చే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సజ్జ కోతలు అయిన తరువాత పొలాలను దుక్కులు దున్ని రబీ పంటగా అలసంద లేదా శనగ పంటను సాగు చేపడతామన్నారు. రెండో పంటలో మంచి దిగుబడి వచ్చి ధరలు బాగుంటే పెట్టుబడులు పోను కొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

అంకాళమ్మకు ఘన పూజలు

కొనకనమిట్ల: సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఆదివారం సాయంత్రం అంకాళమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి పూజలు జరిపించారు. అంకాళమ్మా.. దీవించమ్మా అంటూ గ్రామంలో మేళతాళాలతో ఉత్సవం నిర్వహించారు. గ్రామ సమీపంలోని కొండపై పూజలు నిర్వహించి ప్రజలంతా సహపంక్తి భోజనాలు చేశారు. ముందుగా గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద వేపచెట్టు వద్ద పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవాలని పాడి పంటలు సంవృద్ధిగా పండాలని, ప్రజలను చల్లగా కాపాడాలని మొక్కుకున్నారు.

అన్నపై తమ్ముడు దాడి

బేస్తవారిపేట: స్థానిక పోలేరమ్మ ఆలయం సమీపంలో అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన జరిగింది. అన్నదమ్ములు మధ్య స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో దూదేకుల పెద్ద బాదుల్లా పశువుల పాకలో పనిచేసుకుంటున్న సమయంలో తమ్ముడు చిన్న బాదుల్లా వచ్చి దాడిచేశాడు. మొద్దు కత్తితో వెనుకవైపు నుంచి తలపై కొట్టడంతో తల పగిలి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు



నివాసాల మధ్యలో వర్షం నీరు, మురుగునీరు



నివాసాల సమీపంలోనే పేరుకుపోయిన చెత్త నిల్వలు



పూడికతీతకు నోచుకోని కాలువ వద్ద పెరిగిన మొక్కలు

పారిశుధ్యం ఫట్.. వ్యాధులు హిట్..!

- ఒమ్మెవరం ఎస్సీకాలనీలో చెత్తాచెదారం, మురుగు నిల్వలు
- ప్రబలుతున్న వ్యాధులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఒమ్మెవరం ఎస్సీకాలనీలో పారిశుధ్యం అధ్వానంగా తయారవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ గ్రామంలో సగం జనాభా ఎస్సీలే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశుధ్య పనులపై పర్యవేక్షణను గాలికొదిలేసింది. ప్రధానంగా ఎస్సీ కాలనీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. దానికితోడు రాజకీయ కక్షసాధింపులు కూడా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. అందువలనే ఎస్సీకాలనీవైపు పాలకులుగానీ, అధికారులుగానీ కన్నెత్తి కూడా చూడటం లేదంటున్నారు. ఫలితంగా ఎస్సీకాలనీ మురికికూపంగా తయారై దోమలకు నిలయంగా మారింది. ప్రతి ఏడాది వర్షాకాలంలో సాధారణ జ్వరాలు ప్రబలడం పరిపాటే. అదేవిధంగా ఒమ్మెవరం ఎస్సీ కాలనీలోనూ వ్యాధులు ప్రబలినప్పటికీ.. వైద్యులు, గ్రామ పంచాయతీ అధికారులు, పాలకుల పర్యవేక్షణ కరువైంది. దోమల నియంత్రణకు అవసరమైన కనీస చర్యలు కూడా చేపట్టకపోవడంతో ఈసారి గ్రామంలో జ్వరాల తీవ్రత పెరిగిపోయింది. ఎస్సీ కాలనీలో ఇంటిల్లిపాదికీ చికున్‌గున్యా సోకి కీళ్లనొప్పులతో మంచంపట్టారు.

డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రధాన రహదారిపైనే మురుగు నీరు...

గ్రామంలో కనీసం బ్లీచింగ్ చల్లి ఏడాదిపైనే అవుతోందని స్థానికులు చెబుతున్నారు. దోమల విజృంభణ పెరిగిపోయి అక్కడక్కడా డెంగీ కేసులు కూడా నమోదయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్యం గురించి పట్టించుకోవాల్సిన పంచాయతీ పాలకవర్గం చోద్యం చూస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రధాన రహదారిలోనే మురుగు నీరు ప్రవహిస్తోంది. రోడ్డుపై వర్షం నీరు నిలిచి బయటకు పోయే మార్గం లేక పాచిపట్టి దోమలకు ఆవాసంగా తయారవుతోంది. ఎస్సీకాలనీలో డ్రైనేజీ పూడికతీసి మూడేళ్లు అయిందని స్థానిక ప్రజలు వాపోయారు. ఎక్కడి నీరు అక్కడే నిల్వ ఉండటంతో రోడ్లపై తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామంలోని తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయకపోవడం కూడా గ్రామస్తుల రోగాల బారిన పడటానికి మరో కారణంగా తెలుస్తోంది. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ లోపంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. పంచాయతీ పాలకవర్గం ఇకనైనా పారిశుధ్యాన్ని మెరుగుపరిచి గ్రామస్తులను వ్యాధుల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచి పాచిపట్టిన వర్షం నీరు



మెయిన్ బజారులో రోడ్డుపైకి చేరుతున్న డ్రైనేజీ నీరు

రెండు రోజుల్లో తగిన చర్యలు చేపడతాం

ఒమ్మెవరం గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. మరో రెండు రోజుల్లో అవసరమైన చర్యలు పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తాం. గ్రామం మొత్తం బ్లీచింగ్ చల్లించి ఫాగింగ్ చేయిస్తాం.

– బెస్థర్, ఇన్‌చార్జి కార్యదర్శి, ఒమ్మెవరం పంచాయతీ

మాల ఉద్యోగుల వినూత్న నిరసన

- ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కొవ్వొత్తుల ప్రదర్శన, మోకాళ్లపై నిలబడి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మాల ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

ఒంగోలు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు వేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించినందుకు మాల ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కోలాస్ హోటల్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి మోకాళ్లపై నిలబడి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు, క్రిమీలేయర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో మాలలు వేసినటువంటి రివ్యూ పిటిషన్ తిరస్కరించడం సరికాదని ప్రకాశం జిల్లా మాల ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. దళితులకు రిజర్వేషన్ ఫలాలను దూరం చేయాలన్న దుర్బుద్ధితో వర్గీకరణ ప్రవేశపెట్టి రాజ్యాంగ హక్కుల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దూరం చేయాలనుకుంటున్నాయని మండిపడ్డారు. చివరకు సుప్రీం కోర్టు సైతం తమ న్యాయమైన కోరికల్ని తోసిపుచ్చడం సిగ్గుచేటన్నారు. దేశంలోని ఆంధ్ర, తెలంగాణ తప్పక అన్ని రాష్ట్రాలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నప్పటికీ సుప్రీంకోర్టు తన వైఖరి మార్చుకోకపోవడం భారత రాజ్యాంగాన్ని అగౌరవ పరచడమే అని అన్నారు. వర్గీకరణ, క్రిమీలేయర్‌కు వ్యతిరేకంగా మాలలు భవిష్యత్తులో పెద్ద ఎత్తున నిరసనలతో ఉద్యమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, జిల్లా అధ్యక్షుడు జి.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, ఉపాధ్యక్షులు కాకుటూరి బాబూరావు, శ్రీరాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జనార్దన్, కోశాధికారి యరమాల మల్లికార్జునరావు, పాలడుగు వివేకానంద, మిట్నసల శాంతారావు, కార్యవర్గ సభ్యులు, మాలసంఘాల నాయకులు పాల్గొన్నారు.



కేశవస్వామిపేటలోని ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో గజలక్ష్మి అలంకరణలో రాజ్యలక్ష్మి



ఉప్పుగుండూరులో శ్రీ లలితాత్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు

భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రులు

- లలితాత్రిపురసుందరీదేవిగా పూజలందుకున్న అమ్మవారు

ఒంగోలు మెట్రో: దసరా సందర్భంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఒంగోలు నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో నాలుగో రోజు ఆదివారం దివ్యమంగళ స్వరూపంతో లలితాత్రిపుర సుందరీదేవిగా కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు ఆలయాలకు బారులుదీరారు. భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పూజలు చేశారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: దేవీశరన్నవరాత్రుల సందర్భంగా మండలంలోని గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. అన్ని ఆలయాల్లో దేవీశరన్నవరాత్రులను విశేషంగా నిర్వహిస్తున్నారు. ఉప్పుగుండూరు అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం నాలుగోరోజు అమ్మవారిని లలితాత్రిపురసుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లలితాత్రిపురసుందరీదేవిగా శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు



లాయర్‌పేట సాయిబాబా మందిరంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

చుక్కలు చూపిస్తున్న సర్వీస్ రోడ్డు







మంగమ్మ కాలేజీ జంక్షన్ వద్ద నుంచి కర్నూలు రోడ్డు జంక్షన్ వరకు అధ్వానంగా ఉన్న సర్వీస్ రోడ్డు

- వర్షం కురిస్తే ఆ రోడ్డులో ప్రయాణించే వారికి నరకమే
- నెలల తరబడి అధ్వానంగా ఉన్నా పట్టించుకోని అధికారులు



కర్నూలు రోడ్డు జంక్షన్‌లో ఉన్న భారీ గుంతలో నిలిచిన వర్షం నీరు

ఒంగోలు: నగరంలోని మంగమ్మ కాలేజీ జంక్షన్ వద్ద నుంచి కర్నూలు రోడ్డు జంక్షన్ వరకు వచ్చే పాత హైవేకి తూర్పువైపున ఉన్న సర్వీస్ రోడ్డు ప్రయాణికులకు పట్టపగలే చుక్కలు చూపిస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. అడుగుకో గుంత ఏర్పడటంతో వర్షం కురిస్తే నీళ్లు నిలిచి ఎక్కడ ఎంత లోతు గుంత ఉందో కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఎన్నికలకు ముందు ఈ మార్గంలో తారు రోడ్డు వేసేందుకు టెండరు ఖరారైంది. ఎన్నికలు ముగియగానే కాంట్రాక్టర్లు పని మొదలుపెట్టారు. కానీ, అర్ధంతరంగా నిలిపివేశారు. వారు పనులెందుకు ఆపేశారో తెలియదు గానీ.. ప్రయాణికులు మాత్రం ఈ మార్గంలో నరకం చూస్తున్నారు. కర్నూలు రోడ్డు జంక్షన్‌లో ఆర్టీసీ బస్టాండువైపు తిరిగే మలుపులో సైతం పెద్ద పెద్ద గుంతలు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నగరంలో ప్రధాన రహదారులే ఇంత దారుణంగా గుంతల మయంగా ఉంటే నగరపాలక సంస్థ అధికారులు కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయకుండా వదిలేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

లయన్స్ క్లబ్ చీమకుర్తి గెలాక్సీ అధ్యక్షునిగా కొండవీటి



మున్సిపల్ కార్మికులకు ఆర్పన్స్ అందిస్తున్న ఏడుకొండలు

చీమకుర్తి: లయన్స్‌క్లబ్ ఆఫ్ చీమకుర్తి గెలాక్సీ అధ్యక్షునిగా కొండవీటి ఏడుకొండలు బాధ్యతలు స్వీకరించారు. శనివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత అధ్యక్షునిగా ఏడుకొండలతో పాటు కార్యదర్శిగా బొడ్డు ఆంజనేయులు, ట్రెజరర్‌గా ఆలపాటి నరసింహారావు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మల్లిపుల్ కౌన్సిల్ చైర్మన్ డీ శాంతి, లియో గవర్నర్ పీ విజయకుమార్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ గవర్నర్ సీహెచ్ హరిప్రసాద్, ఆర్.లక్ష్మీనారాయణ, డాక్టర్ బీ జవహర్ హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు ఆర్పన్స్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, కాలేజీ హాస్టల్ విద్యార్థులకు చాపలు అందించారు.

విశ్వబ్రాహ్మణ సంఘ ఒంగోలు నూతన అధ్యక్షునిగా మానేపల్లి

ఒంగోలు: విశ్వబ్రాహ్మణ సంఘ ఒంగోలు నగర నూతన అధ్యక్షునిగా మానేపల్లి గోవిందాచారి ఎంపికయ్యారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్‌గా మంచా బాబుని ప్రకటించారు. ఒంగోలు నగర కమిటీ అధ్యక్షునిగా మానేపల్లి గోవిందాచారి, ప్రధాన కార్యదర్శిగా కందుకూరు దక్షిణామూర్తి, కోశాధికారిగా కొత్తపల్లి సాయి, గౌరవాధ్యక్షునిగా పోతులూరి శివ బ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కలిచేటి నాగబ్రహ్మం, ఉపాధ్యక్షునిగా చాలా కోటేశ్వరావును జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు పీఎస్ బాబు, పోతకమూరి బాలసుబ్రహ్మణ్యం, చోడ శ్రీనివాసరావు, గోనుగుంట బ్రహ్మానందశర్మ, బ్రహ్మయ్య సిద్ధాంతి ప్రకటించారు. అధ్యక్షుడు మానేపల్లి గోవిందాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు ఏ సమస్య వచ్చినా తీరుస్తారని తెలిపారు.



సన్మానం అందుకుంటున్న నూతన అధ్యక్షుడు

పండగలు ప్రశాంతంగా జరుపుకోండి

- రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు

మార్కాపురం: దసరా, దీపావళి పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ నాగరాజు సూచించారు. ఆదివారం తన కార్యాలయంలో సీఐ సుబ్బారావుతో కలిసి మాట్లాడారు. పండగ సెలవులు కావడంతో పిల్లలంతా ఇళ్లకు వస్తుంటారని, చెరువులు, వాగులు, గుండ్లకమ్మలకు ఈతకు వెళ్లకుండా నిఘాపెట్టాలన్నారు. యువతకు టూవీలర్స్ ఇచ్చేటప్పుడు లైసెన్స్ ఉందో లేదో చూడాలని, లైసెన్సులు లేకపోతే వాహనాలను ఇవ్వకూడదని హెచ్చరించారు. సెలవుల సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. పండగల వేళ రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, మట్కా, కోడిపందేలు ఆడితే కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. మారుమూల గ్రామాల్లో కూడా తాము నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నామని, పోలీసులతో దోబూచులాడవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వలన చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చేప్పుడు జాగ్రత్తలు చెప్పాలన్నారు.